క్లుప్తంగా

వాల్మీకి మహర్షికి కేపీ ప్రత్యేక పూజలు



వాల్మీకి మహర్షికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని తర్లుపాడు రోడ్డులోని వాల్మీకి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్చార్జి కేపీ నాగార్జునరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రామాయణ మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన ఘనత వాల్మీకి మహర్షికి దక్కుతుందని నాగార్జునరెడ్డి అన్నారు. ఆయన వెంట వాల్మీకి సంఘ నాయకులు మండ్ల రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాచర్ల: బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై రాజారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన రాచర్లలోని వైన్స్‌షాపుల్లో శనివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ మద్యం అమ్మకాలు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లలు ఉన్నత విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఫాదర్ రంగయ్య

బేస్తవారిపేట: స్థానిక టీచర్స్ కాలనీలోని బిలీవర్స్ ఈస్టర్న్ చర్చిలో అంతర్జాతీయ బాల బాలికల దినోత్సవం చర్చి ఫాదర్ గుర్రం జాన్ బీ రంగయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ రంగయ్య మాట్లాడుతూ పిల్లలు ఉన్నత విలువలను పెంపొందించుకుని సమాజంలో మంచి గుర్తింపు పొందాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టి జీవితంలో స్థిర పడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

పాకల బీచ్‌కు ప్రత్యేక బస్ సర్వీసులు

మార్కాపురం టౌన్:

మార్కాపురం డిపో నుంచి ప్రతి ఆదివారం సింగరాయకొండ మండలం పాకల బీచ్‌కు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, పర్యాటకులు, ప్రయాణికులు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పంచరామాలతో పాటు అరుణాచలానికి కూడా బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఎవరైనా ఎక్కువ మంది వస్తే వారి కోసం ప్రత్యేకంగా బస్సును పంపుతామన్నారు.

నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా నారాయణ



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

పొదిలి:

పొదిలి తాలూకా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా పాముల నారాయణ ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీఓ హోంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కాకర్ల శ్రీనివాసులు, వై.స్వర్ణలత, కార్యదర్శిగా పొదిలి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులుగా ఎస్కే అన్వర్ సాయి, రావెళ్ల సంపూర్ణమ్మ, కోశాధికారిగా ఎస్‌కె.షబ్బీర్ ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా గర్నెపూడి యోబు, కె.ఉమాదేవి వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. చీరాల తాలూకా సంఘం అధ్యక్షుడు విడుదల మురళీ కృష్ణ, ఏపీ ఎన్జీఓ సంఘ మాజీ ఉపాధ్యక్షుడు కె.శ్రీరాములు పాల్గొన్నారు.

మట్టిరోడ్లను కమ్మేస్తున్న చిల్లచెట్లు



గొట్లగట్టు మర్రెడ్డుకుంట రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు



శ్మశాన వాటిక దారిలో చిల్లచెట్లలో ఉన్న బోరు

- చిల్లచెట్లతో మూసుకుపోతున్న దారులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

కొనకనమిట్ల:

మండలంలోని పలు గ్రామాల్లో పొలాలకు వెళ్లే మట్టిరోడ్లకు ఇరువైపులా చిల్లచెట్లు అల్లుకపోవడంతో పొలాలకు వెళ్లే రైతులు, ట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, కాట్రగుంట, పాతపాడు, వెలుగొండ్రాయునిపల్లి, నాయుడుపేట గ్రామాల పొలాలకు వెళ్లే దారుల్లో రోడ్డుపైకి చిల్లచెట్లు అల్లుకుపోతుండటంతో పొలాలకు వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. అదే సమయంలో పొలాలకు దుక్కులు దున్నేందుకు వెళ్లే ట్రాక్టర్లు ఎదురుపడినప్పుడు చిల్ల చెట్లు ఉండటంతో పాటు మూల మలుపులు కూడా ఉండటంతో సైడు తొలగటానికి ఇబ్బందులు తప్పడం లేదని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా అల్లుకున్న చిల్ల చెట్లను తొలగించి రహదారులు అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చిల్లచెట్లలో మంచినీటి బోరింగ్..

మండలంలోని గొట్లగట్టు నుంచి వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీకి వెళ్లే దారిలో మంచినీటి బోరు చిల్లచెట్లలో మూసుకపోయింది. ఆదారిలోనే శ్మశాన వాటిక ఉంది. గొట్లగట్టు గ్రామంలో ఎవరైనా మృతి చెందినప్పుడు అంత్యక్రియలు చేసి వచ్చేటప్పుడు బోరింగ్ దగ్గర కాళ్లు కడుక్కుంటారు. గతంలో అవసరం నిమిత్తం దారి పక్కన బోరు ఏర్పాటు చేశారు. అయితే అంతవరకు బాగానే ఉన్నా బోరింగ్ చిల్లచెట్ల నడుమ మూసుకపోయింది. నీళ్లు వస్తున్నా ముళ్ల చెట్లతో మూసుకపోవడంతో అంత్యక్రియలు నిర్వహించి వెళ్లేవారు బోరింగ్ పరిస్థితి చూసి ఉండి ఉపయోగం లేకుండా పోయిందని అసంతృప్తితో వెళుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి పక్కన చిల్లచెట్లలో ఉన్న బోరింగ్ చుట్టూ అల్లుకుపోయిన చెట్లను తొలగించి బోరును వాడకంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు



కొమరోలు : ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

కొమరోలు: మండలంలోని మూలమలుపుల వద్ద దట్టంగా పిచ్చిమొక్కలు పెరగడంతో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. కొమరోలు నుంచి గిద్దలూరుకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. ఆర్ అండ్‌బీ అధికారులు రహదారి మెయింటెనెన్స్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో మూలమలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద ముక్తాపురం, ఇడమకల్లు గ్రామాల మధ్య రాజుపాలెం గ్రామసమీపంలో దట్టంగా పిచ్చిమొక్కలు పెరిగాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన మొక్కలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కొమరోలు : రాజుపాలెం గ్రామసమీపంలో మూలమలుపు వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల హడావుడి



బస్టాండ్‌లో బస్సు పక్కన ఉన్న ఆటోలు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

మార్కాపురం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటోల హడావుడి ఎక్కువైంది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం బస్టాండ్‌లోకి ఆటోలకు అనుమతి లేదు. అయినా కొంతమంది డ్రైవర్లు అతి ఉత్సాహం చూపుతూ బస్టాండ్‌లోని ప్లాట్‌ఫాం వద్దకు బస్సు రాగానే డోర్ వద్దకు వెళ్లి ఆటోలు నిలుపుతున్నారు. దీంతో బస్సులో నుంచి దిగేవారు, ఎక్కేవారు ఒకరినొకరు తోసుకుంటూ కొట్లాడుకుంటున్నారు. 2 బస్సులు ఒకేసారి ప్లాట్‌ఫారం వద్దకు వచ్చి ఆగగానే ఆ బస్సుల మధ్య ఆటో పెట్టడంతో బస్సులో నుంచి దిగే ప్రయాణికులు బయటకు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారింది. ఆర్టీసీ సిబ్బంది చోద్యం చూడటంతో ప్రయాణికులు ఆటో డ్రైవర్లతో గొడవలు పడుతున్నారు.

ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం: నరసింహులు, డీఎం

మార్కాపురం బస్టాండ్‌లోనికి ఆటోలు రాకుండా ఉండేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. నిబంధనల ప్రకారం ఆటో డ్రైవర్లు బయటే ఉండాలి. బస్టాండ్‌లోకి ఆటోలను తీసుకుస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



వెలుగొండలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని వారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు.

కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు శ్రీవారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆరోగ్య లక్ష్యాలను సాధించాలి



రికార్డులను పరిశీలిస్తున్న బెల్లం నరసింహారావు

గిద్దలూరు రూరల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించాలని జిల్లా ఆరోగ్య విస్తృత, మాస్ మీడియా అధికారి బెల్లం నరసింహారావు అన్నారు. పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్‌లోని అర్బన్ హెల్త్ క్లినిక్‌ను ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలలోని ఓపీ రికార్డులు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తప్పనిసరిగా ఎఫ్ఆర్ఎస్ వేసుకోవాలన్నారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. మలేరియా, క్షయ, బోద, కుష్టు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణ, మానసిక ఆరోగ్యం రాష్ట్రీయ స్వస్థ కిశోర కార్యక్రమాలపై వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యాధికారి జగన్నాథం సూర్యచంద్ర, సూపర్‌వైజర్ సుధారాణి, వైద్య ఆరోగ్య సిబ్బంది రాధిక, భాను పాల్గొన్నారు.

కనులపండువగా లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణం



ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ లక్ష్మిచెన్నకేశవస్వామి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామిని వివిధరకాల పూలు, ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉభయదాతలు పట్టు వస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు,

కుక్కల భయంతో బెంబేలు



సబ్‌కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న వేములకోట గ్రామస్తులు



కుక్కల దాడిలో గాయపడిన అరుణ్‌కుమార్

- చిన్నారిపై కుక్కల దాడితో తీవ్ర గాయాలు

మార్కాపురం: మండలంలో కుక్కల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో కుక్క కాటుకు గురైన బాధితులు ఉంటున్నారు. మండలంలోని వేములకోట, జేఆర్ కాలనీ, కొట్టాలపల్లి, దరిమడుగు, రాయవరం తదితర గ్రామాలతో పాటు మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డు, శివాజీనగర్, బ్రహ్మంగారి గుడి, పీఎస్ కాలనీ, భగత్ సింగ్ కాలనీ తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం రాత్రి వేములకోట పంచాయతీలోని జేఆర్ కాలనీలో ఆరేళ్ల వయసున్న అరుణ్‌కుమార్‌పై కుక్కలు దాడిచేసి మూతిని పీకిపెట్టాయి. సమీపంలోని ప్రజలు గమనించి కుక్కలను కొట్టి బాబును కాపాడి వైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రతిరోజూ రోడ్డుపై వెళ్లే వారిని వెంటబడి కరుస్తున్నాయి. కాలువకట్ట రోడ్డులో గురువారం కుక్కలు రోడ్డుపై వెళ్తున్న దాసును, శుక్రవారం రోజున కొండేపల్లిరోడ్డులో రోడ్డుపై వెళ్తున్న శివకృష్ణను కరిచాయి. ఇలా ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట కుక్కల దాడులు ఎక్కువయ్యాయి. ఇటీవల మార్కాపురం పట్టణంలో మున్సిపల్ అధికారులు పలుచోట్ల కుక్కలు పట్టటున్నా ఇతర ప్రాంతాల నుంచి పట్టుకున్న కుక్కలను రాత్రిపూట మార్కాపురం పట్టణంలో వదిలి వెళ్తున్నారు. దీంతో పరిస్థితి యథావిధిగా మారుతోంది. వాహనాలపై వెళ్లేవారిని వెంటపడి కుక్కలు కరుస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు కుక్కలు వెంట పడుతున్నాయని భయంతో సడన్‌గా బ్రేక్ వేస్తూ కిందపడి గాయాల పాలైన సందర్భాలూ ఉన్నాయి. కుక్కల పునరుత్పత్తి కాకుండా ఇంజక్షన్లు వేస్తున్నా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను అర్ధరాత్రి సమయాల్లో వాహనాల్లో తెచ్చి మార్కాపురం పట్టణ శివారులో వదిలేస్తున్నారు. ఈ సమస్య అటు ప్రజలతో పాటు ఇటు అధికారులకు కూడా తలనొప్పిగా మారింది. గ్రామాల్లో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కుక్కల బెడదను నివారించాలని పలు గ్రామాల ప్రజలు ఇటీవల జరిగిన ప్రజాస్పందన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. వేములకోటలో కుక్కల బెడదను తొలగించాలని గ్రామానికి చెందిన జంకె చిన్న వెంకటరెడ్డి సబ్‌కలెక్టరుకు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.



దరిమడుగులో కుక్కల సంచారం

చిన్నమొత్తాల పొదుపుతో ఆర్థిక పరిపుష్టి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

మార్కాపురం టౌన్: చిన్నమొత్తాల పొదుపు ద్వారా ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని సెక్యూరిటీ సెబీ ఆర్థికరంగ నిపుణుడు డాక్టర్ ఎస్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శ్రీసాధనా డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులకు ఆర్థిక అంశాలపై నిర్వహించిన సెమినార్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుకునే వయసు నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని, దీని వల్ల ఆర్థిక ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. పొదుపు కోసం ఎలాంటి మార్గాలను ఎంపిక చేసుకోవాలో ఆయన సూచించారు. తక్కువ స్థాయి పెట్టుబడులను చేయడం ద్వారా దీర్ఘకాలం రాబడులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూధన్, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్, కో ఆర్డినేటర్ పవన్‌కుమార్, అకడమిక్ ఇన్‌చార్జి డాక్టర్ పీఆర్‌కే ప్రసాద్, లెక్చరర్ రిషీ షారోన్ పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి భక్తుల పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మీ సమేత గొంద్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టు వస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. సంతానం కలగాలని గిరికొండ చుట్టూ దంపతులు ప్రదక్షిణలు చేశారు. మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి నైవేద్యం చెల్లించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇలా ఉంటే రోగాలు రావా..





వీధుల్లో చేరిన మురుగు నిల్వలు



తాగునీటి బావి చుట్టూ నిల్వచేరిన మురుగు

కురిచేడు: అడపా దడపా కురుస్తున్న వర్షాలకు నీరు నిల్వలు చేరుతున్నాయి. గ్రామాలలో డ్రైనేజి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నిల్వలకు వర్షపు నీరు తోడై గ్రామాలలోని అంతర్గత రోడ్లు తటాకాలుగా మారుతున్నాయి. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో గ్రామంలోని వీధులను పరిశుభ్రంగా వుంచుతూ నీటి నిల్వలు లేకుండా చూడాల్సిన పంచాయతీ వ్యవస్థ నిద్రావస్థను నటిస్తుంది. వారిపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతుండటంతో గ్రామాలులో పరిశుభ్రత పడకేసింది. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో అధికారులు ఫొటోలకు ఫోజులివ్వటంతో సరిపెడుతున్నారు తప్ప ఎక్కడా గ్రామాల్లో స్వచ్ఛత కనిపించటంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అందుకు మండలంలోని పొట్లపాడు గ్రామం నిదర్శనంగా నిలుస్తుంది. పొట్లపాడు గ్రామంలో ఏ వీధి చూసినా మురుగు నిల్వలు దుర్వాసన వెదజల్లుతూ దర్శనమిస్తున్నాయి. వర్షాలు కురిసి రైతులు, రైతు కూలీలు పొలం పనులలో బిజీగా వుంటున్నారు. బావులు,నీటి కుళాయిల వద్ద మురుగునిల్వలు చేరి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. పగలంతా కష్టపడి వచ్చిన రైతులు, కూలీలు ఆదమరచి నిద్రిస్తున్నారు. రాత్రి సమయంలో వారిపై దోమలు దాడిచేసి అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంత జరుగుతున్నా పంచాయతీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామంలోని మురుగు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని, అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.